విషము పరీక్ష

"నిండు ముఖంతో ఉల్లాసంగా లోకాన్ని చూసి నవ్వుతూ, మేఘాల్లో ఆటలాడుకుంటూ— పరుగెత్తుకు పోతూన్న ఆ చందమామ మన కోసమే—కదూ?" సుభద్ర మాట్లాడకుండా గంభీరంగా అనంతాకాశంలోని శశి సౌందర్యాన్ని చూస్తోంది.

"జీవితమంతా నువ్వూ, చంద్రుడూ, ఐతే—?" అర్ధోక్తిలోనే ఆగి, వేణు ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూశాడు.

అమాయకంగా లోలోన నవ్వుకొని ఆమె అంది: "ఇప్పుడల్లాగే అనిపిస్తుంది—"

"ఎప్పుడూ ఇల్లాగే అనిపిస్తుంది; నిద్రావస్థలో, జాగ్రదావస్థలో— ఊహల్లో, పోహల్లో, అన్నిటా నువ్వే ఆక్రమించావ్... ఇతర్లకు ఇందులో తావులేదు. ఎప్పుడూ నువ్విలా నాపక్కనే ఉంటే...?"

"ఏంచేస్తారు?"

కొంటెగా నవ్వి అన్నాడు: "ఏంచేస్తానో? ఇల్లా హృదయానికి హత్తుకొని— మెరిసే నీకళ్ళల్లోంచి నీహృదయాన్నీ, ఆత్మనూ చూస్తూ వాటిని నావిగా చేసుకునేందుకు నాశక్తినంతట్నీ వినియోగ పరుస్తా. నేను నువ్వుగామారి, ఏకమై, ఐక్యమై నీలో కలిసి కరిగిపొయ్యేందుకు ప్రయత్నిస్తా"— ఉద్రేకంతో ఆమెను దగ్గరకు లాక్కొన్నాడు.

కొన్ని నిమిషాలవరకూ వారిభౌతిక శరీరాలు నీలాకాశంకిందఉన్నా—వారి హృదయాలూ, ఆత్మలూ పైదో

డుగా ఏవో సౌఖ్యమయ ప్రపంచాల్లో విహరించినయి....
గడచిన క్షణాల్ని గుర్తించుకోకుండానే వారిలోకప్పు వ్యక్తులై—ఒకళ్ళ కళ్ళ నొకళ్ళు ప్రశ్నించుకుంటూ వింత నవ్వొకటి నవ్వుకున్నారు.

"సుభా! ఇద్దరమూ దంపతులమైతే?" మాట మధ్య లోనే అందుకొని ఆమె అంది: "మీకు ఎప్పుడూ ఇదేగోల! ఇప్పుడుకామా? లోకందృష్టిలో, సంఘందృష్టిలో కాక పోతే మాత్రమేం?"

"అదికాదు సుభా! నన్ను సరిగ్గా అర్థం చేసుకో; ఇద్దరి మధ్యా ఒక శాశ్వతసంబంధ మేర్పడాలి. అప్పుడుకాని నీకు గౌరవం ఉండదు. ఆలోచించు: నువ్వొక ధనికుడి భార్య వంటే నీకీ ప్రజలిచ్చే ఉన్నతస్థానాన్ని—"

"నాకా? నాకా?" అని వికటంగా నవ్వి అంది: "నాకు పిచ్చి భ్రమలు పెడుతున్నారు. మీరొకరూ ఉంటే నాకిం కేమీ అక్కర్లేదు. నాకెందుకీ మనుషుల ముఖస్తుతులు? నాలోలేని విలువను నాకు ఆపాదిస్తున్నారు. నాకు కులం లేదు; గోత్రంలేదు. ఎవరికీ, ఎప్పుడూ, ఎందుకూ పనిరాకుండా పడివున్న నన్ను ఏరుకొచ్చారు; మీరుమాత్రమే నాకిచ్చే గౌరవంతో నేను తృప్తిపడగలను. ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించి, ఎన్ని గంగాస్నానాలుచేసినా పంది నందికాలేదుగా! సాంఘికంగా వివాహానికి విలువఉండొచ్చు. కాని నీతికీ, ఆ విలువకూ ఉత్తర దక్షిణధృవాలకున్నంత దూరంవుంది. ప్రేమకు వైవాహికజీవితమే అవసరమా? నేను లోకం ఎదుట మీకు భార్యనై ఇంతకన్న ఎక్కువ ఆనందాన్నివ్వ

గలననే నమ్మకం నాకు లేదు."

కొంతసేపు బాగా ఆలోచించి అన్నాడు: "కాదుసుభా! నాకష్టాల్లో సుఖాల్లో—అన్నింటాసీకు సమభాగం కావాలి; అర్ధాంగివైతే ఎంత సులభంగా వీటిని సంపాయించొచ్చు—?"

"ఇంతకు మించిన అధికారం నాకొద్దు. బతకటానికి అవసరమైనంత డబ్బే నాకు చాలు. మీ ధనాన్ని తినే ఇంతమంది జనంలోనూ నేను కూడా ఒకతె నౌతాను. నామాటవినండి... మీరు ఏదో బాధకు అనవసరంగా గురౌతున్నారు."

"సుభా నువ్వు నాకు శాశ్వతంగా కావాలి. 'నా' అనుకునే వాటిల్లో నువ్వొకతె వవాలి..." తన హృదయాన్ని విప్పి చెప్పగల భాష ఇదేనని అతను గాఢంగా నమ్మాడు.

"ఔతాను—ఎప్పటికీ మీదాన్నే ఔతాను. దానికి వివాహబంధమేనా అవసరం? ఆ సంస్థమీద నాకు నమ్మకం లేదు. నాలోని సంస్కారంతో, విశ్వాసంతో, జీవితాంతం వరకూ మిమ్ము నా స్వామిగా ఆరాధించగల నేనే నమ్మకం నాకు వుంది. నామీద మీకు లేదూ?" ఆచివరి ప్రశ్నకు ఆమెకంఠంలో దీనత్వం స్ఫురించింది.

నమ్మకం! ఇదిలేకపోతే ఆమెను తను జేరదీసేవాడేకాదేమో? వేణునవ్వి, "అదిలేకపోతే ఇంతవరకూ ఇద్దరమూకలసి ఉండేవాళ్లంకాదు—" అన్నాడు.

"ఆ నమ్మకాన్నే వృద్ధిపరుచుకోండి. ఇల్లా గడిచిపోయే కాలమే మనను ఇంతకన్న గాఢంగా బంధిస్తుంది..."

నిశ్చలంగా అతను క్షీణకాంతుల్లో పశ్చిమాద్రిని ఎగబాకుతూన్న చందమామలోకి చూడసాగాడు.

గట్టిగా గాలివదుల్తూ ఆమెఅంది: "నేనురాణించినా క్షీణించినా మీరేగా నాకుదిక్కు! ఈ అనాథకు ఇంకెవరున్నారు...?"

ఆమెగాయపడ్డదని నొచ్చుకొని, ప్రసంగాన్ని మార్చుతూ వేణు, "లేదులే—సుభా! నీకు నేనూ నాకు నువ్వూ—ఈ జీవితాంతంవరకూ—మనది ఏకప్రాణి—అవునా ?" అన్నాడు.

"ఊఁ" అనిఆమె అంతర్వాణి సన్నగా పలికింది.

2

సుభద్ర జ్వరం వేణులో చలనం కలిగించకపోలేదు. డాక్టర్ కృష్ణారావుమధ్యా తనమధ్యా ఆ చిన్ననాటి స్నేహం ఏ రహస్యమూ లేకుండా చేసింది.

"సుభను ఒక కంటకాయాలి. రెండు మూడురోజులదాకా నేనుఊళ్ళోఉండను. ఆమె నా ప్రాణసమానం! ఇప్పుడు నా కామెను చూసే వ్యవధికూడా లేదు—" నవ్వుతూ తలవూపిన స్నేహితుడి భుజాన్నితట్టి—వేణు స్టేషన్‌ముఖంపట్టాడు.

ఆ రెండురోజుల జ్వరం మశూచికానికి 'నాంది' అయింది. తన వ్యాధిని తెలుసుకొని సుభద్ర ఒణకక, తొణకక తనలో తనువికటంగా నవ్వుకొంది. ఆమె సేవకై ప్రత్యేకంగా నియమింపబడ్డ ఇద్దరు దాసీలూ తమ లోపం లేదని చాటుతూనే ఉన్నారు.

డాక్టర్ వచ్చినప్పుడల్లా మెల్లిగా కన్నుతెరిచి, బాధగా చూస్తూ, "వారొచ్చారా?" అనేది.

"లే-దు." ఆమెకు ఆప్రశ్న, డాక్టర్‌కు ఈ జవాబూ

కంఠోపాఠ మైపోయ్యాయ్—ఈ ఐదురోజుల్లోనూ !

ఆమె ప్రియుడిరాకకోసం ఆతృతపడజొచ్చింది; డాక్టరుకు ఆమె ఆరోగ్యాభివృద్ధినిగూర్చి ఆతృత అధికమైంది.

వేణురాగానే డాక్టర్ నవ్వుతూ, "ఆమె నీకోసం ఎదురు తెన్నులు చూస్తోంది" అన్నాడు.

"ఆమె ఎల్లా ఉంది?"

"మ—శూచికం ! ఒక మాదిరిగాఉంది—"

డాక్టర్ ఉచ్చారణ తగ్గుస్థాయిలో ఉన్నా వేణును భయపెట్టింది. అతనిహృదయంలో రేకెత్తిన తుపాను లక్షణాల్లో అధికభాగం ముఖంలోనే ముద్రితమయ్యాయ్. ఊహాప్రపంచంలో రోగిష్టిమంచాన్నీ, ఆవ్యాధితో బొబ్బలెక్కిన శరీరాకృతితో బాధపడే రోగినీ సృష్టించుకొని కలవరపడ్డాడు. తను అధికానురాగంగా ఆరాధించిన ఆ సౌందర్యమూర్తి ఈనాడు మహామ్మారి కరకు కోరల్లోపడి నలిగిపోవటం తలచుకోలేకపోయ్యాడు. ఆమె వికృతరూపంతో తన ఎదుట నిలబడ్డట్టుంది— అతని కళ్లు శూన్యంలోని కాల్పనిక వికారాకారాన్నికూడా చూడలేక ఒక్కసారిగా కొన్నిక్షణాలవరకూ మూసుకొన్నాయ్.

విషాదగాత్రంతో అన్నాడు: "ఇప్పుడామె ఎక్కడుంది?"

"ఆ—అద్దెకొంపలోనే! చూద్దుకానివి—వెళ్దామా?"

"నేనా ? నేనా ?" అని వికారంగానవ్వి అన్నాడు: "నేను రాలేను—కాదు; రాలేదనిచెప్పు—"

"అబద్ధందేనికి ? ఆమె నీకోసం కలవరిస్తోంది"

"ముందు నాకుచెప్పు— కృష్ణా ! ఆక్రిమి అంటకుండా

వుండేందుకు ఈ లోకంలో ఉన్న రక్షలు—"

డాక్టర్ హేళనగా, పెద్దగానవ్వాడు. "ఫినాయిల్ తాగేయ్ ఉదరగోళమంతా శుభ్రంగా క్లీన్—క్లీన్ అయిపోతుంది—"

"నవ్వులుకాదు—నిజంచెప్పు—"

"ఇదేనా నీ భయం? మరేంఫర్వాలేదు. ముందు జాగ్రత్త పడ్డాకనే వెళ్దాంలే"

చేతికి ఉన్న టీకాల్ని చూచుకొన్నాక వేణు బుర్రతిరుగుడు వేగం కొద్దిగా తగ్గింది. కాస్తఆగినిట్టూర్చి వేణు, "నేను రాను కాని—" అన్నాడు.

"ఇంత భయమైతే ఎట్లా?"

"భయమో—గియమో! ఎవరిప్రాణం వాళ్ళకు తీపి—"

"ఇదేం ప్రాణగండం కాదులే! మేము మందులిచ్చే వేషాలు వేసుకొన్నా మానవులమేగా! మాకు మాత్రం వుండదూ ప్రాణంమీద తీపి?"

"కాదనను-కాని మీకుఅలవాటైపోయింది. ఆపరేషన్లకు కూడా చలించని మొండిగుండెలున్న వాళ్లు మీరు. మీకు హృదయాలున్నా వాటిపైన తాబేటి డిప్పలున్నాయ్! ఇదంతా ఎందుకు? నేను మాత్రం రాదల్చుకోలేదు—"

"వేణూ! ...పొరపడుతున్నావు! నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డమెయ్యనూ? ఆమె కళ్లు కాయలుకాచేటట్టు నీకోసం వేచి కూర్చొంది."

"ఏమన్నా అవనీ—నేను రాను—"

* * * *

"ఇవ్వాళ ఏమన్నా నయంగా వుందా?"

"లేదు; అంతకంతకు ప్రమాదావస్థలోకి లాగుతోంది. ఇది ప్రాణగండమనికూడా నాకు తోస్తుంది."

కళ్లుమూసుకొని వేణు, "ఆమె జీవించకూడదనే దేవుణ్ని ప్రార్థిస్తా—"అన్నాడు.

డాక్టర్‌ను ఆశ్చర్యమూ, అయోమయమూ ఉక్కిరి బిక్కిరి చేసాయ్. "ఏమన్నావ్?—ఆమె జీవించటం కూడా నీకు ఇష్టంలేదా? ఇదేనా నువ్వాల్సినమాట? డాక్టర్లకు కాదు హృదయాలు లేంది—నీలాంటివాళ్ళకు."

వేణు నవ్వి అన్నాడు: "ఆమె జీవించి ఏం ప్రయోజనం? ఎవర్ని సంతోషపెట్టగలదు? ఆమె మృతువు పాలయితే చాలా అదృష్టవంతురాలౌతుంది—"

"నీ నిఘంటువులో 'సానుభూతి' అనే పదం కూడా లేనట్టుంది. కాపు కాయంగానే నరికేసే అరటిచెట్టులాగు—ఆమెను చూస్తూన్నావ్. ఆమె దీనావస్థచూస్తే నాకే జాలేస్తోంది; నువ్వొచ్చావని చెప్పా; ప్రాధేయపడ్డది, ప్రార్థించింది: నిన్నొకసారి రమ్మని. ఈనాటితో ఆమె ఆయువుకూడా సరేనేమో! ఒకసారిరా—"

"ఇప్పుడొచ్చేందుకు వీల్లేదని చెప్పు—"

3

మెల్లిగా కళ్లు తెరచి, ఎండిన పెదవుల్ని నాలికతో తడిచేసుకుంటూ ఆమె అడిగింది: "రానన్నారా?"

డాక్టర్ చూసిన నేలచూపుల్లో ఆమెకు నిరాశాజ్యోతి

స్ఫురించకపోలేదు. వేటకాని అంబుకు గురైన అమాయకపు లేడిలాగు చూస్తూ ఆమె అంది: "వారితో చెప్పండి: నేనింక ఎక్కువకాలం బతకనని. గతిలేని నన్ను చేరదీసి, నాజీవితంలో లోటు లేకుండా— చేసుకున్న భార్యకన్న ఎక్కువ ఆదరంతో చూసిన ఆయన్ను— యీ జీవితానికి కడసారి చూసి, కృతజ్ఞతా పూర్వక నమస్కారంతో మృత్యుదేవతను నాకు నేనై ఆహ్వానించుకుంటాను. ఆయనకే నేను అనవసరమైతే—మీలాటి పరాయివాళ్ళకేం అవసరం నాకు సానుభూతి చూపటానికి? వారికి హాని చేద్దామనికాదు; వారు నన్ను తాకనక్కర్లేదు; ఈగదిలోకూడా ప్రవేశించనక్కర్లేదు. అక్కడ—ఆవాకిలిదగ్గర, ఒక్కనిమంసేపు నిలబడితే చాలు. ఈకోర్కను చంపుకుందామన్నా, ఇంకా పోని యీకళ్ళకు అది సాధ్యమవటంలేదు..... వారికోసం రక్తస్పర్శవున్న ఆత్మబంధువుల్నీ, ప్రాణస్నేహితుల్నీ కూడా వదులుకొని, ఆయన పాదాల దగ్గరే నాజీవిత సర్వస్వాన్నీ ఉంచాను. ఆపాదాలే నన్ను తంతే—నాకింకదిక్కేది? ఈనాడు దిక్కులేని చావుకు గురౌతూంటే— యీలోకంనుంచి విరమించే ప్రతి ప్రాణీ కోరే—సానుభూతి కన్నీటికే నేను నోచుకోలేదా? ఈ అంటువ్యాధిని ఆహ్వానించుకున్న నేరం నాదా? వారు నా జీవితానికి తోడునీడై ఉంటారని గట్టిగా నమ్మబట్టిగా— యీనాడింత దుఃఖానికి గురవటం—?"

మాటలింక చెప్పలేక కళ్ళురెండూ నీళ్ళతో నింపింది. డాక్టర్ హృదయం ఆ అనాథ ప్రాణిపై అపారమైన జాలితో నిండింది.

డాక్టర్‌కు నమస్కరిస్తూ ఆమె "డాక్టర్ గారూ! మీపాదాలమీద పడతాను: మీరు వారికి ప్రాణస్నేహితులు—శ్రమ అనుకోకుండా తుదిసారి వారిని ఇక్కడకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించండి—నాకు ఏ బాధా లేదు—వారిని చూడాలనే కోరిక—తప్ప! ఒక్క చూపేగా నేను కోరింది" అని శూన్యదృక్కుల్తో గదిని పరికించింది.

డాక్టర్ లేచి నిలబడి "ప్రయత్నిస్తానమ్మా—" అన్నాడు; ఆమె కృతజ్ఞతా పూర్వకంగా డాక్టర్ వైపుచూసింది.

*   *   *   *

"ఇప్పుడామె మృత్యుముఖంలో వుంది. ఈ చివరిసారి చెప్తున్నాను వేణూ! ఒక్క చూపుకు మాత్రమేగా ఆమె అనర్హురాలైంది? ఒక్కసారి వెళ్దాంపద. ఆమె మృతశరీరానికి నువ్వుకార్చే కన్నీరు అనవసరం—తరువాత పశ్చాత్తాపపడి కూడా లాభముండదు—"

ఆమె మాటలన్నీ చెప్పి, అన్నాడు: "ఇది ఆమె తుది సందేశం! దీన్ని పాలించుటం నీవిధి! ఆమె నీకు చేసిన త్యాగానికి నువ్వీమాత్రం కృతజ్ఞతను చూపాలి. నిన్ను ఇన్నాళ్ళు ఆనందడోలికల్లో ఊపినవ్యక్తి ఈనాడు నీకు శత్రువైందా? నీ ప్రవర్తన నాకే అగమ్యగోచరంగావుంది. నీ హృదయం సంస్కరింప బడ్డదనుకొన్నా. నీలో ఏ పశువు పనిచేస్తోందో నాకర్థ మవటంలేదు... లే-వెళ్దాం-ఆమె ఇంకా కొద్దినిమిషాలు మాత్రమే ఈలోకంలో ఉంటుంది."

వేణుకు గత జీవిత చరిత్రంతా కళ్ళముందు కట్టినట్టయింది.

ఆ దినాల్లో ఆమె తననెంత సుఖపెట్టింది! ఆమెకు తనహృదయంలో ప్రత్యేకించిన అత్యున్నతస్థానాన్నికూడా నిరాకరించి తన పాదదాసిగా పరిగణించుకొని సేవచేసింది! ఇప్పుడు...? ఆ వ్యాధి! అంతకన్న పాపంచేసుకొన్న వ్యక్తులు లోకంలో ఉండరని తను నమ్మాడు-అసలు ఆతలపులే తనను పిచ్చివాడుగా చేస్తున్నయ్. ఆవలి గట్టులేని ఆలోచనా సాగరంలో అతని ఊహాలన్నీ ఒకే నిశ్చయాన్ని సూచిస్తున్నయ్. తన ప్రియురాలి తుదికోర్కెలను చెల్లించలేని తన అసమర్థతను దూషించుకొన్నాడు; చెదరిన హృదయంలోంచి వెలువడ్డ కన్నీటి బిందువులు కళ్లనుంచి బైటపడినై. అది హృదయ పరివర్తనని భ్రమపడ్డ డాక్టర్, "వెళ్దాం-" అన్నాడు.

"నేను రాను—ఎందుకు రాలేనో నాకే తెలియదు—"

"మానవుడివి చావుకు భయపడతున్నావ్—"

"నాకు చావంటే భయంలేదు. కాని మృత్యుదేవత ఈ ఒకరూపంలో కన్పిస్తే మాత్రం నాకు భయమే!"

"పిరికిపందవు-జీవితంలో దేన్నీ తలకిందులుగా తపస్సు చేసినా సాధించలేవు—" స్నేహితుడి చనువును ఊతగా తీసుకొని, అతన్ని బాధించి, నొప్పించటైనా ఆమెకు చూపాలనే గట్టి పట్టును డాక్టర్ వదల్లేదు. కాని వేణు మౌనాన్నే సమాధానంగా సూచించాడు.

"ఇంత దుర్బలహృదయుడి వనుకోలా-కృతఘ్నుడివి. ఆమె నీ ధర్మపత్నిఅయినా, తల్లయినా, తండ్రిఅయినా, ప్రియపుత్రుడైనా, ప్రాణస్నేహితుడైనా—ఇదేగా నువ్వు చూపే సానుభూతి?"

"ఏ—మో!"

"రేపు నువ్వు ఇదేవ్యాధికి గురైతే—మేమందరమూ నీ దగ్గరకు వచ్చేందుకు నీలాగే భయపడితే-నువ్వెలా బాధపడతావ్?"

"నాకు తెలియదు"

"నేను ఎన్నిసార్లు ఆమెగదిలోకి వెళ్ళా—నన్నంటనిది నిన్ను అంటుతుందా?"

"నేను—నువ్వు కాదుగా!"

"నీలాంటి పాషాణహృదయాలు లోకంలో ఉన్నారను కోలా-రావా?"

"రా-ను"

డాక్టర్‌కు కోపంవచ్చింది "ఆమెనూ-ఆమె హృదయాన్నీ ఆత్మనూకూడా గాయపరచావు! నీ జీవితచరిత్రలో ఇది తీరని కళంకం! నీలాటి వాళ్ళనుగురించి నలుగురూ నవ్వుతారనన్నా ఉండాలి."

ఈ మాటలుకూడా వ్యర్థమై గాలిలో కలిసిపోయాయ్. వేణు చేతులుపట్టుకొని డాక్టర్ అన్నాడు, "ఇది నాకోర్కె-గా చూడు. వాకిలిదగ్గర నిలబడి తిరిగిరావొచ్చు-ఆమె నిన్నంతకన్న ఎక్కువ కోరలేదుగా!"

"అదినాకు చాతకాదు"

ఇవన్నీ గడుసు సమాధానాలని తలచిన డాక్టర్-వేణును గట్టిగా పట్టుకొని జరజరా లాక్కుపోతూ, "బలవంతానలాక్కుపోతా-" అన్నాడు.

వేణు డాక్టర్ పట్టుతప్పించుకొనేందుకు వ్యర్థప్రయత్నం

చేసి, అతను బంధించిన హస్తాల్ని పట్టుకొని వేళ్లాడుతూ, "నన్ను వదులు-కృష్ణా! నువ్వు నాస్థితిలో వుంటే తెలిసేది-" అన్నాడు సీరియస్‌గా!

డాక్టరుకు అసహ్యంపుట్టింది. వేణు చేతుల్ని విసిరికొట్టి, "నువ్వొక విచిత్రవ్యక్తివి." అన్నాడు.

గంభీరంగా చూస్తూ వేణు, "ఆమెతో చెప్పు నన్ను క్షమించమని; ఆమెను ఇంకా ప్రేమిస్తున్నానని" అన్నాడు.

"మాటల్లో మాత్రమే-!" అని, ఆ అమానుషప్రాణిదగ్గర నిలబడలేక, డాక్టర్ నేలను గట్టిగా కాలితో తన్ని చురచుర చూస్తూ, వెళ్లిపోయ్యాడు.

4

డాక్టర్ ముఖంలోని నిరాశనుగుర్తించి ఆమె తలవాల్చి, "రానన్నారా?" అంది.

"రా-డట!"

ఇతంతా మరిచిపోదామని గట్టిగా కళ్లుమూసుకుంది; కాని బాధను ఎవరు మరిచిపోగలరు?

నిరాశతో నిట్టూర్చి హృదయావేదనంతా ఇమిడే క్షీణ స్వరంతో ఆమె అంది: డాక్టర్‌గారూ! నా పాతికేళ్ల బతుకూ ఈనాడు బైటపడ్డది! ఈ పదేళ్లూ అర్థంకాని ఒక వ్యక్తి నాకీ మృత్యుముఖంలో అర్థమయ్యారు! నేను కనిన కమ్మని కలలన్నీ ఈనాడు భ్రమగా తేలినై! నా జీవితమే వ్యర్థమైంది: ఈ నాడు వారు నాకు విధించిన ఈ అమానుష కఠినశిక్ష భరించలేనిది! వారింకా వస్తారనే ఆశతోనే ఇంత

సేపూ పోయ్యే ప్రాణాల్ని పట్టుబలవంతాన నిలుపుకు కూర్చున్నా. పోనీండి-"

ఎడారి వేడిలో మాడుతూ, దాహానికి పీకార్చుకుపోయి-దూరాన కన్పించే ఎండమావుని చూసి భ్రమించి-ఇంకా శరీరంలో మిగిలిన కొద్దిశక్తినీ వినియోగించి పరుగెత్తి, మోసానికి గురై, నిరాశతో కృంగిపోయిన పాంథుడిలాగు ఆమెచూపులు కాంతిహీన మయినై. ఒకసామాన్య మానవహృదయం భరించలేని దుఃఖాగ్ని ఆమెహృదయగోళంలో పెద్దగా ప్రజ్వరిల్లింది. కొన ఊపిరిని కూడదీసుకుంటూ మాటల్ని ఏర్చి కూర్చుకుని, "ఈకోరిక ... వారిని-గాయపరిస్తే....నన్ను... క్షమిం—చ మని చెప్పండి—" అంది.

క్షణక్షణానికీ క్షీణిస్తూన్న కాంతిని ప్రసరింపజేసే ఆమె కన్ను లింక ఈ ప్రపంచాన్ని చూచేశక్తిని కోల్పోయాయి. గోడవైపుతిరిగి కడసారి గాలిని పీల్చేందుకు వ్యర్థప్రయత్నం చేసి—ఆమె నిద్రాదేవి కౌగిట్లోకి శాశ్వతంగా ఒరిగింది.

* * * *

"ఆమె పోయింది—" వేణు మానంతో అనంతశూన్యంలోకి చూడసాగాడు.

"వచ్చి—చూడు"

"రా-ను"

"ఆమె జీవించి నీకు చేసిన హానికన్న ఇప్పుడేమీ ఎక్కువ చేయదుగా!"

స్నేహితుడి రెండుచేతుల్నీ పట్టుకొని వేణు అన్నాడు: "ఈ దుర్బలత్వమేమిటో నాకే అర్థమవదు; దాన్నివిప్పి చెప్పు

కునేందుకు నా భాషచాలదు. ఆమెను వీలైనంత త్వరలో కాటికి జేర్చు—"

"నువ్వు రాక్షసుడివి-"

వేణు కన్నీరు కార్చాడు; అతని హృదయంతరాళంలో పొంగిపొరలే అంతులేని, పంతులేని విచారవాహినిని చిక్కబట్టుకుంటూ, "అవనీ కృష్ణా! నేను ఆ ప్రాంతాలకు రాలేకపోయినా-ఆమెను ప్రేమించాను. ఆమెకోసంమాత్రమే నేను ఇన్నాళ్లూ కష్టాల్ని ఎరుగను. ఇప్పుడుకూడా ప్రేమిస్తున్నా".

"కాదు-మిన్నూ మన్నూ ఏకమైనంతగా ఆమెను మదోన్మాదంతో కామించావ్; మోహించావ్; ఆమె ఆత్మనే వంచించావ్. ఆమెనొక యంత్రంలాగా వాడుకున్నావ్-అది నీకు పనికిరానినాడు, దాన్ని లెక్కచెయ్యలేదు. ఆమె ఆత్మశాంతి లేకుండా-తీరని ఒక్క కోరికతోనే నీపాదాలకిందపడి నలిగిపోయింది. ఆమె బూడిదైనా నీకు లక్ష్యంలేదు— ఇదే నా ప్రేమ ?"

వేణు నిట్టూర్చి అన్నాడు: "నిజం కృష్ణా! ఈమాటలు నా హృదయంలోంచి వస్తున్నాయ్. నేనామెను అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీకూడా ప్రేమిస్తున్నాను-"

"నీది ప్రేమకాదు.-ప్రియురాలికోసం ఏమీ, ఏదీత్యాగం చెయ్యలేని నువ్వు ప్రేమకు అనర్హుడివి. నీ ప్రేమను నీకు నువ్వే రుజువు చేసుకోలేకపొయ్యావ్-"

"కాని, ఇదినాలాంటి సామాన్య మానవప్రాణికి అసాధ్యమైన, అతీతమైన విషమ పరీక్ష!" అని వేణు చిన్న కుర్రాడిలాగు వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. —అక్టోబరు 1940.